భర్త అనుజ్ఞ ననుసరించి యిచ్చి ఆటకత్తెను సాగనంపి యిల్లాలు తన మగనితో అంటూవుంది: "ఎక్కణ్ణుంచి వచ్చిందండీ ఇంత వితరణం ఈవేళ మీకు?" అని అడిగింది. "మీ తఢాకాకు దాంది పైతఢాకా అందనా? లేక నాకంటె అది ఎక్కువ అందంగా వుందనా? ఎక్కణ్ణుంచి వచ్చిందండీ ఇంత వితరణం ఈవేళ మీకు?" అని రెట్టించింది.

విశ్వనాథం భార్యకు ప్రత్యుత్తరం ఇయ్యకుండా ఒకానొక నూతన వికాసంలో భాసమానుడౌతూ సన్యేందిర! సన్యేందిర:" అని పునశ్చరణ గావించి తన్మయుడైనాడు.

## వినాయకుడి సంబరం

ఎక్కడైతే చెట్టుందో ఆపట్నంలో అక్కడల్లా నీడ. ఎక్కడైతే నీడ వుందో ఆపట్నంలో అక్కడల్లా నిలువ నీడలేని బిచ్చగాండ్లు, బిచ్చకత్తెలూ. లక్షాధికార్లైనా తమతమ సిమెంటు భవనాలు ఏ భూకంపానికో, ఏ తుపాను విసురుకో పడిపోతాయి అనే భయం కలవాళ్ళయి యుండవచ్చుగాని, ఆ బిచ్చగాండ్లకు బిచ్చకత్తెలకు ఎప్పుడూ ఏభయమూలేదు. చెట్లను పాతినవాళ్లుకారు వారు. చెట్లుకు నీరుపోసి పెంచినవాళ్లూ కారు. ఆచెట్లకూ ఆబిచ్చగాండ్లకూ బిచ్చకత్తెలకూ అవినాభావసంబంధం ఏలా ఏర్పడిందో? అడక్కుండా పువ్వునుపడేస్తాయి అపేక్షించకుండా మలయమారుతాన్నివీస్తాయి. కాని ఆ బిచ్చగాండ్లకూ బిచ్చకత్తెలకూ ఎంతమాత్రం ఆకలి తీర్చే చెట్లుకావవి. అవి అన్నీ దిరిసెన చెట్లు. పువ్వు లతిమెత్తన, నీడ

లతిదట్టము! కాని కాపుకడుపునిండించే దెంతమాత్రమున్నూకాదు. ఆ కారణంగా అక్కడ కూర్చుని సమావేశమయ్యే బిచ్చగాండ్లు బిచ్చకత్తెలు తమపొయ్యి మంటలకుగాను ఆ చెట్లయొక్క ఎండు పుల్లల్ని కట్టెపుల్లలుగా ఉపయోగించుకుంటూ. అవసరం వెంబణ్ణి బెరడు ఇత్యాదుల్ని ఊడబెరికికొంటూ చెట్ల కుపకారం చేసే బదులు అపకారమే చేస్తూవుంటారు. అయితే ఏటేటా చిగురుపట్టి అంతో ఇంతో ఎదుగుచూపించేవిగాని, ఆ చెట్లు ఈదురోగోడామని తమర్ని ఆశ్రయించుకున్న బిచ్చగాండ్లలా బిచ్చకత్తెల్లా కని పించవు. అవి అందానికి ఆనందానికి అనువైన చెట్లు. ఊరి మధ్యన ఉన్నాయి అంటే నాగరీకులకు చాలా చనువైన చెట్లు అవి వేఱే చెప్పనక్కరలేదు.

మర్నాడు వినాయకచవితి పండుగ అనగా, ఈరోజున ఒక ఏడాది ఏం జరిగిందీ అంటే, ఒక బిచ్చగాడు కాళ్ళు కళ్ళు లేనివాడు ఆలా ఆ చెట్లల్లో ఒక చెట్టున సాయంకాలమునకు జేర్లా బడిపోయాడు. కళ్లు లోతుగా పోయాయో అసలున్నాయో లేదో కనిపెట్టడానికి ఆస్కారంలేని వెఱ్ఱిమొగం వాడిది. కాళ్లు కొంకర్లు పోయి, అప్పటికప్పుడే, పైబడ్డ ఆ చెట్ల వ్రేళ్ళలా మెలికలు తిరిగిపోతున్నాయి. ఆవేళప్పుడు ఒరిగే సూర్యుని ఒబుపైన ఎఱుపుకాంతి తన ఎదుఱొమ్ములమీది ఎఱ్ఱని పలాచటి పయటమీద పడి, యినుమడింపుగా, రంగు శృంగం కాపరుచుకుంటూ వొయ్యారంగా నడచే ఒకానొక ఎలనాగ భిక్షుకురాలే ఆమేను మట్టెలచప్పుడు చేసుకుంటూ ఆ కబోదును దరిసింది. "ఓలమ్మీ! ఒశేవు! బుల్లీ!" అని కూకేశాడు కబోదు. "ఓరి! నివ్వింకా ఇక్కణ్ణే వున్నావంట్రా? అందరూ మనవోళ్లు ఆరిఆరిస్థానాలు

ఆక్రమించుకుని వినాయకుడి గుడిపేరిని కూకుడుండిపోయారు. అప్పుడే ఈ పొద్దే! రేపు వినాయకుడి చవితంట! ఓరి! నివ్వింకా ఇక్కడ్నే వున్నావంట్రా?" అంటూ ఆ గుడ్డి కుంటివాణ్ణి ఆ కామిరెడ్డి కులుక్కుంటూ చేరి కుశలప్రశ్న వేసింది. "అమ్మీ! ఆదాకా నెగిసి వెళ్లే ఓపికగాని ప్రాపకంగాని నాకులేదు. బుల్లీ! రేపు వినాయకుడి చవితి అయితే మనకు వొరిగేది ఏమిటి? మన ముఖాన్ని ఎవళ్ళు పడేసినా రాగిడబ్బే. తప్పితే రవిన్ని బియ్యం! పట్టెడేసి ఉండ్రాళ్లూ ఇళ్ళల్లోనే వండుకు తినేరు భాగ్యవంతు లంతాను. నీదాకాను నాదాకాను రావు!"—"బియ్య ముంటే నే నొండిపెడతా మాంవా!"—"ఏమిటి అన్నమా?"—"కాదు ఉండ్రాళ్లుమాంవా!"—"రేపా మాపా?"—"రేపు! ఈ మాపు లెవళ్లూ ఉండ్రాళ్లు వండుకోరు. తెల్లారిగాని వినాయకుడి సంబరం లేదు"—"వినాయకుడి పొట్ట పెద్ద పొట్ట బుల్లీ! సిన్నప్పు డెప్పుడో కళ్ళున్నప్పుడు చూచిన గాపకం!"—"అంతపొట్టా ఎప్పుడూ ఎత్తుగా నెగిసి వుంటుందేగాని ఒకప్పుడూ లోతుకుపోదు. అదీ ఆ దేవునిసిత్రం!"—"ఆకలి లేని దేవుడులాగున్నాడు. ఆణ్ణి అయి అయినా పుట్టానుగాదు నేను?"—"ఓరి! కోరక కోరక వినాయకుడి రూపమే కోరావు?"—"ఆ దేవుడి ముక్కూ పెద్దదే! బారెడు పొడుగుండేని ఆ రోజుల్లో నా బారతో కొలిస్తే!" —"ఇప్పటికీ అంత పొడుగే వుంది అది మటి విడ్డూరం! అంత ముక్కున్నా నాటికీ నేటికీ జిర్రున చీది ఎరుగడు"— "అసలు ఏనుగు తుండము ఏనుగు మొండెము పెట్టి పుట్టిన అవతారమూర్తి! ఆ పొట్టలో కూకుంటే మరి మనకు ఆకలే వుండదు బుల్లీ! ఆది ముక్కెట్టుకు మనం గాలిపీలిస్తే ఎన్నేళ్లకూ

చావం బుల్లీ!"—"ఒరేవు! నీతో కబుర్లు సెబుతూ ఇక్కడ కూకుంటే అక్కడ నా కెవ్వడో కొక్కొట్టి వూరుకుంటాడు. సంద లడుతోంది. ఏమిటి నీ వ్యాపారం సెప్పు? ఇక్కడిల్లా సస్తా నంటావా? అలా ఆ వినాయకుడి గుడివీధికి వస్తానంటావా?" —"రాను బుల్లీ! రాలేను బుల్లీ! ఇవిగో! ఈ సోలడు బియ్యం పట్టుకెళ్ళి నాకు ఈరేత్రి కొంత గంజి కాసి పట్టుకొచ్చిపొయ్యి. ఈలా ఈ సెట్టు మొదట అంటిపెట్టుకు నిదరోతా! ఇనాయకుడు నాదగ్గరకు రావాలిగాని నేను ఇనాయకుడి దగ్గరకు పోలేను" —"నీ దగ్గరకు రావడమంటే నీవు మహా తపశ్శాలివి అవితే వస్తాడు. లేకుంటే మహాదాతవైతే వస్తాడు. రెండూ కాని కబోదు బిచ్చగాడివైనప్పుడు నిన్ను చేరేవా డెవడ్రా? కాళ్ళు సరిగ్గా సాచుక మాపులు తొంగోలేవుగాని ఇనాయకుడు నీ దగ్గఱకు వస్తాడు? ఈ మాపటికి గంజి నేనే కాచుకోవడంలేదు. నీక్కూడా ఎక్కడ కాచగలను? నీ బియ్యం నీ గోసినే వుంచుకో! సెట్ల మధ్య సీకటికీ నీ కంటి సూపుకీ తేడా కనిపెట్టేవాడు ముక్కోటి దేవతల్లోనూ లేరు ముప్పైకోటి ప్రజల్లోనూ లేరు. వెళ్లొస్తా! నీవు వస్తావేమో ని సాటున నేనూ అడుక్కోవచ్చు ఆ దేవాలయపు వీధిని అని అనుకున్నాను! నీకీపూట గంజి కాసిపోసి, నిన్నెత్తు కెళ్ళినా వచ్చేటట్టు లేవు. పెద్దసతుకులు కొత్తగా నేర్చేవు. ఇనాయకుడే నీ దగ్గఱకు రేపు రావాలంటున్నావు! పంపిస్తా! కాసుకుండు!'' అని ఎటకారంగా హేళనగా వెక్కిరించి తిప్పు కుంటూ చక్కాపోయింది ఆ తిరిపికత్తె! ఆమెయొక్క మాటనే వినగల్గాడు గాని ఆమె తన వెనకాముందూ కాపరిచిన వయసూ వొయ్యారం ఆ కబోదు కానలేదు. ''ఇనాయకుడు ఈ పాళంగా

నాకు ప్రత్యక్షమై రెండు కళ్ళూ రెండు కాళ్ళూ ప్రసాదిస్తే లంజా! విన్నల్లా పోసిస్తానే ఈ సీకటిర్రేతి!" అని లేని వోపిక తెచ్చుకొని, గొంతుక హెచ్చించి, ఒక్క కేకేసి, లోని అక్కర వొక్కటీ తీరకుండానే ఆ భాద్రపద శుద్ధ చవితి నాటి రాత్రి కొత్త వెన్నెల మసకమసకలో మానుమొదట జేర్లబడి చిత్త మీశ్వరుడికి ఒప్పజెప్పి నిద్రపోయాడు ఆ కబోదు గాడిదకొడుకు. దాన్ని 'లంజా' అని తిట్టిన వీడు 'గాడిదకొడుకు' కెందుకుగాడు? "ఆ రాత్రి వొక్కటే రాత్రి ఆ చెట్లక్రింద మరి భిక్షుకులు నివసింపని ర్రేతి! మరి నరసంచార మెరుగని ర్రేతి! మరి సురాసురలు విహరించని రాత్రి!

వెళ్ళిపోయిన తిరిపకత్తెకు మాత్రం నిద్రపట్టి ఏడిసిందా? వీధివీధి మధుకర వృత్తిని తిరిగి అప్పటికప్పుడే 'కలవపువ్వులు' 'పత్రి' 'మామిడాకులు' అంటూ కేకలువేసి అమ్మేవాళ్ళ కేకల కులిక్కిపడి తప్పుకుంటూ—తబుకు దిబుకు దిమ్మల్లోకొట్టి తీసిన మట్టి వినాయకుల్ని అసంఖ్యాకాల్ని కనుగొంటూ, ఎట్టకేలకు తనతావు చేరుకుంది. "అమ్మా! బిచ్చం! తండ్రీ! బియ్యం! అప్పా! కానీ! మామ్మగారూ! అంటిపండు!" అని అరవ సాగింది ఆ వినాయకుడి గుడివీధిని. వయసూ వొయ్యారం కొయ్యబొమ్మకైనా చూపించవచ్చునుగాని ఒకటోరకం గొంతుక ఎలా రాగలదు? అది ఆమెకేవుంది! అయినప్పటికీ అతి నిరుపేదరాలు కావడంచేతను, అనభిజ్ఞ కావడంచేతను ఈ మహా ప్రపంచంలో ఒక అమావాస్య చీకటి రేకగా మఱుగుపడిందేకాని మెఱుపు తీగలా మెఱసిందికాదు ఆమె! అవితే కబోదు చూపులో—

లో చూపు అందాం!—ఆ తిరిపకత్తె, కడాని జిగిలా, రతీజాని ములికిలా, ఆమని రతనపు గుళికలా, కోటి పారిజాతాల పరిమళింపులా విరిసిపోయింది తెల్లవార్లూను. "అది ఎత్తుకు తీసుకుపోయి ఆ దేవుడి గుడివీధిని కూకుదుండబెడతానంటే పోలేకపోయాను" అని ఒకపాలి ఏడుపు. వినాయకుడి గొప్ప బొజ్జ, కొలువ శక్యంగాని మహాతుండం తలుచుకు ఒకపాలి నవ్వు ఆత్మలో ప్రదర్శించుకుంటూ ఆ కబోదు కల కాకుండా, కలత కాకుండా కడజాముకూడా ఆ రాత్రి గడిపాడు.

తెల్లారితే వినాయకుడి చవితి వినాయకుడి పూజ! అర్చన! ఆరగింపు! హారతి!—ఓ! ఈ లోకంలో అసంతృప్తి మరి వుండడానికి వీల్లేదు. ఆకలి మరి వుండడానికి వీల్లేదు.

ఆ పట్నంలో ఒక సర్కసుకంపెనీకి చెందిన ఏనుగుల్లో ఒక ఏనుగు దానికి యజమాని సరిగా తిండిపెట్టకో, దానిని తిన్నగా చూడకో—ఏదో కారణంగా ఆ తెలతెలవారే సమయమప్పటికి విడివడ్డదై రోడ్డే వచ్చి వచ్చి ఈ దిరిసెనచెట్ల గుంపుల మధ్య అడవిలో ఆగినట్టు ఆగింది. ఘీంకరించింది. కబోదు. ఆ ఘీంకారం వినబడిన్నీ దేనిదో అన్నట్లు ఊరుకొన్నాడు. సహజ చాపల్యం కొద్దీ తొండం ఊచింద. దాని గాలి సోకి కొంచెం అట్టిట్లు తప్పుకొన్నట్లు ఇంకా చెట్టుమొదటికి ఎగబాకాడు కబోదు. ఏనుగు పై కొమ్మల్ని అందుకుని కిందికి విరిచి పడేసింది నాలుగైదింటిని. ఎవడైనా చెట్టెక్కి కొమ్మలు నరుకుతున్నాడా అని కబోదు కాననేరనివాడైనా పైకి తలెత్తాడు కళ్ళున్నవానికిమల్లే. వానికేమీ కనబడలేదు.

మరొక్క నిమిషంలో చెట్టుమొదటినీ ఈ కబోదునూ కలేసి తన తుండాన్ని చుట్టుకొన్నదై ఏనుగు చెట్టు సమూలంగా పెకలించి కబోదు కనబడని రీతిగా చెట్టును వానిమీదకు కూల్చి. చెట్టుమీద తాను సర్కసు రంగస్థలంలో ముక్కాలిపీటమీద కూర్చున్నట్లు కూర్చుంది తొండం చాచుకుని నోరు తెఱచుకుని ఘీంకరిస్తూ.

అడుగున కబోదు ఊరికే ఏమీ తెలియక. చెట్టును తాను కౌగిలించుకుంటూవున్నానన్న ఇదికొద్దీ కొంత సేపు. చెట్టే తనను కౌగిలించుకుంటూ వున్నదన్న ఇదికొద్దీ కొంతసేపు. కొట్టుమిట్టాడి తుదకు. ఒకానొక దైవోపహతిగాస్పృహతప్పి ప్రాణాలువిడిచి. ఆ చెట్టుకొమ్మల క్రింద ఏనుగు క్రిందా కనబడకుండా అణగారిపోయాడు.

సర్కసు మేనేజరు వచ్చినీ్న ఏనుగును ఏమీ చేయలేక పోయినాడు. ఆ రోజు వినాయకుడి చవితి కావడంచేతను. ఆ కూర్చున్న ఏనుగును ఎవరూ కూడా లేవనెత్తలేక పోయినారు. ఒక్కరూ అడుగున కబోదు బిచ్చగా దొకడు అణగారి మృతుడయ్యాడని తెలిసికోలేక పోయారు. బిచ్చగాండ్లు బిచ్చకత్తెలు తదితరు లందరూ వినాయకుడి గుడివీధికి బోయి బారులు తీరి అడుక్కుంటూ వుండే యావత్తని ఆనాడుండిపోయారు.— చూచిన ప్రజలందరూ. వచ్చిన జనమంతా. ఆ ఏనుగుకు బొట్టెట్టి. నోట్లోకి పళ్ళు ఉండ్రాళ్ళు అందిచ్చి. ప్రత్యక్ష విఘ్నేశ్వర స్వరూపం అని భజనలు చేశారు. ఏనుగు తన సహజ చాపల్యం కొద్దీ. తొండాన్ని ఆడిస్తూ. అలాగే కూర్చుంది. తన అడుగున ఒక కబోదు బిచ్చగాడు మరి అరవకుండా.

అరయకుండా, మరణించిపోయి వున్నాడు అవి అది ఎరుగునో ఎరుగదో? ఏమైతేం! అలాగే కూర్చుండిపోయింది! అపర వినాయకుడిలా!

కబోదుయొక్క మరణ వృత్తాంతం అవలోదనం కాని వాళ్ళకు పైని వివరించిన కథాభాగం అంతా వినోదవంతమే కావచ్చు కాని కథ వ్రాస్తూవున్న నాకుమాత్రం మిక్కిలి విషాద వంతంగా తట్టేని—ఏమా అంటే ఆ ఏనుగు క్రింద మరణించిన ఒక కబోదు బిచ్చగాడు వుండివున్నాడని నాకు తెలుసు. అయితే నేనుమాత్రం ఏమి చేయగలను? కలంతో "పాపం! పాపం!" అని మరి నాలుగు పంక్తులు వ్రాయగలను. అంతే. చనిపోయిన కబోదు బిచ్చగాణ్ణి కాని, కూలీపోయిన ఆ దిరిసెనచెట్టును గాని తిరిగి బ్రతికించలేను. లోకంలో నిత్తెమూ మరణిస్తూవున్న వ్యక్తులెలా అయితే పునర్జీవులు కారో అలాగే కథల్లో చని పోయిన వాళ్ళున్నూ! వాళ్ళున్న మర్త్యులే!

సాయంకాలం ఆ వినాయకచవితినాడు, కథ విని, అక్షింత లేసుకుని, చవితి చంద్రుణ్ణి చూసుకుంటూ, తిరిపెకత్తె కబోదు బిచ్చగాని నిమిత్యార్థమై, నైవేద్యం పెట్టుకువచ్చినట్టు ఒక బుట్టలో ఎక్కడ తీసికొని రాగలిగిందో పది వుండ్రాళ్ళు వేసి కొని - "ఓరి మాంవా!" అంటూ కేకేసుకుంటూ వచ్చింది. మాంవ లేదు సరిగదా మాంవ కూర్చునే మానూలేదు. క్రిందా మీదా చూసింది. మీదను ఏనుగుంది. ఏనుగుక్రింద కూలిపోయిన చెట్టువుంది చెట్టుక్రింద మరేముందో? అలా తొంగి చూసింది. ఇలా వంగి చూసింది. "మాంవా!" అని తిరిగి కేకేసింది. మాంవకు బదులు ఆకాశం ప్రతిధ్వనిగా "మాంవా!" అని

తన కవల సోదరి అన్నట్టయింది. అదే ప్రత్యుత్తరమా? మరి జాడలేదు. జవాబు లేదు. మాంవ మాపటీ దయ్యాడా అని ఏనుగు పైపై కెగిసి ఎగిసి ఆ పడుచు చూచింది గాని, ఎవరూ కనిపించలేదు.

బుట్టెడు వుండ్రాళ్లు ఏనుగునోట్లో పోసి—"మాంవా! నీపని నేటితో ఇలా మట్టం అవుతుంది అని అనుకోలేదు. నీవిలా మన్నుపాలవుతావని అనుకోలేదు." అంటూ శోకం తీయ సాగింది ఏనుగు బుట్టెడు వుండ్రాళ్ళు తినేసేసి ఘీంకరించి లేచి చక్కాపోయింది పంజ వెన్నెల్లో.

కాని కబోదు బిచ్చగాని కళేబరంకోసం ఆకాడ పడి పోయిన చెట్టుయొక్క పడుగు పేక కొమ్మల క్రింద రెమ్మల క్రింద నెమకే వా రెవరు? తిరిపెకత్తె వొక్కర్తుకా ఒక గడియ ఆ ఆకు అలము తప్పించి తనకు తన "మాంవ" కనిపిస్తాదేమో నని ఆటమటించి నెమకుతూ అరచింది. కాని లాభం లేక పోయింది. ఏనుగుతోటి కూడా పోనైతినే అని అనుకుంది. కాని అది తనతో రానిచ్చేటట్టులేదే! అని రిచ్చపోయింది. "ఏనుగే మాంవ మాంవే ఏనుగు అయివుండాలి." అని అందరితోను ఆ కబోదు బిచ్చగాని మహాదాశయాన్ని వెల్లడి చేస్తూ ప్రతీ వినాయకుడి చవితికీ ఒక పెద్ద అట్ట వినాయకుణ్ణిచేసి అక్కడే- ఆ చెట్టు పడిపోయి కబోదు బిచ్చగాడు చనిపోయి, రెండూ కూడా కలగలపుగా తగలపెట్టబడ్డ ఆ ఖాళీ స్థలంలో ఉంచి, ఉత్తప్పుడు ఆ అట్ట పొట్టలో తాను పండుకుని నిద్రిస్తూ పబ్బ మప్పుడు "ఉండ్రాళ్లెట్టండి మా వినాయకున"కంటూ అడుక్కుని ఆ అంగన అధిగమించింది.

దేవతారాధనలో ఒక దివ్యధామము తన కల్పినట్టు సంతోషించింది. చెట్టునంటే, చెట్టునంటిపెట్టుకున్న మనిషినంటే, ఏనుగు రూపుమాప కలిగింది కాని ఆ అట్ట వినాయకుడి పొట్ట నొక్కళ్ళూ అణచలేకపోయారు. మణచలేకపోయారు.

క్రమంగా దాన్ని ప్రజలు సెమెంటు వినాయకునిగా తయారు చేశారు. దాని లోపల తిరిపెకత్తె వాసం చేసేలాగు ఖాళీవుంచి వెనకాల ఒక దర్వాజా పెట్టేరు. ఎదురునుంచి ఉండ్రాళ్లు మెక్కేలా నోరు చూపించారు. ఈ వింత స్ఫింక్సు రూపం కన్న కామధేనువాకారంతన్నా లోకానికి ఆశ్చర్యం గొల్పింది. అందులోనూ తిరిపెకత్తె వెనకవెంపునుంచి వెలికి వచ్చి, ముందుకు చేరి ప్రతీ వినాయకచవితి పండక్కీ ఆ సెమెంటు వినాయకుడికి బొట్టెట్టి అందగిస్తూవుంటే లోకానికి చూడముచ్చటేసింది.

సంపూర్ణము.



రాజేశ్వరి ప్రెస్, రాజమండ్రి.